# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 26-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ప్రతి ఏడాది డిఎస్సీ నియామక నోటిఫికేషన్ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
2. జీఎస్టీ హేతుబద్ధీకరణతో రాష్ట్రాలకు కలిగే ఆదాయలోటును కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క కోరారు.
3. "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కింద ఆంధ్రప్రదేశ్ లో 34 లక్షల మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.
4. జాతీయవాది, ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి ఈరోజు.
5. అల్పపీడనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

==========================

ప్రతి ఏడాది డిఎస్సీ నియామక నోటిఫికేషన్ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతిలోని సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై డీఎస్సీ కి ఎంపికైన 15,941 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను మంత్రి నారా లోకేష్ తో కలిసి నిన్న పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 33 సెకన్లు

---

వస్తు సేవల పన్ను –జీఎస్టీ హేతుబద్ధీకరణతో రాష్ట్రాలకు కలిగే ఆదాయలోటును కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క కోరారు. ఢిల్లీలో నిన్న జరిగిన ఒక చర్చావేదికలో ఆయన మాట్లాడుతూ, ఆర్థిక సంవత్సరం మధ్యలో పన్నుల విధానంలో మార్పులు చేయడం వల్ల ఆదాయం తగ్గుతుందని తద్వారా సంక్షేమ పథకాలు ప్రభావితమవుతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించే పన్నుల వాటా ఆయా రాష్ట్రాల నుంచి వసూలయ్యే పన్నుల నిష్పత్తి ప్రకారం చేయాలని కోరారు.

---

"స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో 34 లక్షల మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. కృష్ణా జిల్లా నున్నలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 16,000 లకు పైగా వైద్య శిబిరాల ద్వారా మహిళలు ఉచిత పరీక్షలు చేయించుకుంటున్నారని చెప్పారు. వచ్చే నెల 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ శిబిరాల ద్వారా మహిళలు, చిన్నారులు, బాలబాలికలకు కలిపి కోటిన్నరకు పైగా వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ రోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

హైదరాబాద్–శ్రీశైలం మార్గంలో 4 వరుసల ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి గత సాయంత్రం పాత్రికేయులతో మాట్లాడుతూ, శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని అన్నారు. పర్యావరణానికి, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం లేకుండా రహదారి నిర్మాణం చేపడతామని కేంద్ర మంత్రి వివరించారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. భారతదేశాన్ని ప్రపంచ మీడియా కేంద్రంగా మార్చేందుకు కేంద్రప్రభుత్వం నిర్వహించిన వేవ్స్ సదస్సు గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01 :30)

---------------------------

పరిసరాల పరిశుభ్రతకు అందరూ సమయం కేటాయించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. "స్వచ్ఛతా హి సేవా" కార్యక్రమాల్లో భాగంగా ఏలూరులో నిర్వహించిన "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్" ఇతివృత్తంతో చేపట్టిన శుభ్రతా డ్రైవ్ లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం .అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోజులో కొంత సమయం కేటాయించి స్వచ్ఛందంగా ముందుకువచ్చి శ్రమదానం చేయడం ద్వారా స్వచ్ఛభారత్ సాకారమవుతుందని అన్నారు.

---------------------------

జాతీయవాది, దేశభక్తుడు, ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి ఈరోజు. 1867వ

సంవత్సరం సెప్టెంబరు 26వ తేదీన ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లా– ఖండవల్లి గ్రామంలో ఆయన జన్మించారు. లక్ష్మీ నరసింహం, సంఘసేవతో పాటు ‘దేశమాత’, ‘మనోరమ’, ‘సరస్వతి’ వంటి పత్రికలను స్థాపించి వాటిని సాంఘిక, రాజకీయ చైతన్య అస్త్రాలుగా వినియోగించి స్వాతంత్ర్యోద్యమం పట్ల ప్రజలను జాగృతం చేశారు. పత్రికా నిర్వహణతో పాటు పలు రచనలు చేశారు. ఆయన రచించిన “గయోపాఖ్యానము” నాటకం, “గణపతి నవల బహుళ ప్రాచుర్యం పొందాయి. సామాజిక పరిణామాలను చరిత్రకారుడుగా తన రచనల్లో పొందుపరిచిన చిలకమర్తి లక్ష్మీనరసింహం 1946 జూన్ 17వ తేదీన తన 79వ ఏటా కన్నుమూశారు.

---------------------------

దసరా శరన్నవరాత్రులలో ఐదవ రోజైన ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీకనక దుర్గ అమ్మవారు శ్రీ మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీశైలక్షేత్రంలో దసరా మహోత్సవాలలో నిన్నా నాల్గవరోజు భ్రమరాంబికాదేవి కూష్మాండదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరోవైపు తెలంగాణలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ఈ రోజు అలిగిన బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గత సాయంత్రం స్వామివారు హంస వాహనంపై సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉదయం సింహా వాహన సేవ జరుగనుంది.

---------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని ఇది పశ్చిమ దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీరాల ఆనుకుని వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తరాంధ్ర, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వాతారవరణ శాఖ అధికారి ఎం. వెంకట్రావు. తెలియజేస్తూ,

వాయిస్ 24 సెకన్లు

అలాగే ఉత్తర, తూర్పు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

======================